# 42వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రైతు జేఏసీ నాయకులు



గుమ్మడిదలలో డంపింగ్ యార్డును రద్దు చేయాలని రిలే నిరాహార దీక్ష చేపట్టిన కేఎస్‌జీ యువసేన సభ్యులకు సంఘీభావం తెలుపుతున్న రైతు జేఏసీ నాయకులు



అసెంబ్లీ సమావేశంలో డంపింగ్ యార్డును రద్దు చేయాలని ప్రసంగించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న నల్లవల్లి రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి18: ప్యారానగర్ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలంటూ గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 42వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీలో డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కేఎస్‌జీ యువసేన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నల్లవల్లిలో రజక సంఘం సభ్యులు దీక్షలో పాల్గొనగా రైతు జేఏసీ మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో సంఘీభావం తెలిపారు. రైతు జేఏసీకి రజక సంఘం సభ్యులు రూ.5 వేల విరాళం, రైతులు ప్రసాద్, రామరాజు రూ.5 వేల చొప్పున రూ.పది వేలు అందజేశారు. కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో జేఏసీ నాయకులు మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు నరేందర్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, మద్దీ ప్రతాప్‌రెడ్డి, మద్దీ వీరారెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, వడ్డె మోహన్, ఆంజనేయులు, మేకల యాదగిరి, మోహన్‌రెడ్డి, పోతరాజు సుధాకర్, కాలకంటి రవీందర్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, మంద బలరాంరెడ్డి, సంజీవరెడ్డి, చక్రపాణి మహిళా జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

### సునీతాలక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన నాయకులు

సోమవారం అసెంబ్లీ సమావేవంలో ఎమ్మెల్యే వాకిట సునీతా లక్ష్మారెడ్డి డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీని వల్ల నర్సాపూర్, గుమ్మడిదల, శివంపేట మండలాల్లోని గ్రామాల ప్రజలకు తీవ్ర ముప్పు ఉందని ప్రసంగించారు. హర్షం వ్యక్తం చేసిన నల్లవల్లి జేఏసీ నాయకులు ఎమ్మెల్యేను ఆమె స్వగృహంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎప్పుడు ప్రజల పక్షగానే ఉంటూ డంపింగ్ యార్డు రద్దు కోసం పోరాడుతానని తెలిపారు. జేఏసీ నాయకులు మన్నె రామకృష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్, కొరివి సురేశ్ ఉన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు, మార్చి 18: సంగారెడ్డి జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర/బాలికల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐనోల్, అల్లాదుర్గ్ గురుకుల ప్రిన్సిపాల్ స్రవంతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు దరఖాస్తు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. రూ.150 చెల్లించి www.mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్లు ఏప్రిల్ 15న డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహిస్తారన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఎంపిక చేస్తారని వివరించారు.

## వలసల నివారణకే ఉపాధిహామీ

రాయికోడ్, మార్చి 18: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వలసలు పోకుండా నివరించేందకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని నారాయణఖేడ్ ఈజీఎస్ ఏపీడీ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్, రాయికోడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు 5,600 కుటుంబాలకు 3 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. జిల్లాలోనే రాయికోడ్ మండలం ఈజీఎస్‌లో ముందంజలో ఉందన్నారు. ప్రతి గ్రామంలో 100 మందికి తగ్గకుండా కూలీలకు పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో షరీఫ్, అధికారులు రమేశ్, విష్ణు, వరప్రసాద్, తుకప్ప, మురళి ఉన్నారు.

## క్షయవ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

గుమ్మడిదల, మార్చి18: క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో క్షయవ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ మండల వైద్యాధికారి మధుకర్ తెలిపారు. మంగళవారం గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో మున్సిపాలిటీలోని పీహెచ్‌సీ వైద్యుడు మధుకర్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్‌రావు సిబ్బందితో కలిసి క్షయవ్యాధి గ్రస్తులను నిర్ధారించడం కోసం ఎక్స్‌రే క్యాంప్ నిర్వహించారు. ఇందులో 83 మందికి క్షయవ్యాధి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా 21 మందికి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. వారికి తెమడ పరీక్షలు చేసి చికిత్స ప్రారంభిస్తామని డా.మధుకర్ తెలిపారు. వీరితోపాటు పంచాయతీ సెక్రెటరీ సురేశ్‌యాదవ్, టీబీ ఫీల్డ్ ఆఫీసర్లు దేవేందర్, కృష్ణ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరీక్ష మెటీరియల్ పంపిణీ

గుమ్మడిదల, మార్చి18: మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరహరి పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మంగళవారం అన్నారంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, వీరభద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మురళి, జయశంకర్ గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు నరహరి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వీరితోపాటు ప్రధానోపాధ్యాయురాలు పవళీనారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్టు, టీ షట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు గాజుల వీరేందర్

## క్రికెట్ కిట్టు పంపిణీ

చౌటకూర్, మార్చి18: మండలంలోని చక్రియాలలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు గాజుల వీరేందర్ యువకులకు మంగళవారం క్రికెట్ కిట్టు అందజేశారు. గ్రామానికి చెందిన 15 మంది యువకులు ఇతర గ్రామాల యువకులతో క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన క్రికెట్ కిట్టు, టీ షట్లు, ప్యాడ్స్, క్యాప్‌లు పంపిణీ చేశారు. ఆటల పోటీల్లో పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయేందర్‌రెడ్డి, రాజమల్లేశం, కోర్పోల్ రవికుమార్ పాల్గొన్నారు.

## కాలనీవాసుల ఆందోళన

కంగ్టి, మార్చి 18: మురుగు రోడ్డు మీదకు వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కంగ్టిలోని కురుమ కాలనీవాసులు మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు కాలువల్లో ప్రవహించకపోవడంతో కాలనీ రోడ్డు పూర్తిగా దుర్గంధంగా తయారైందన్నారు. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటుందని మోకాల్లోతు నీళ్లు నిలబడతాయని, అప్పుడప్పుడు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోలేదని వారు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు


సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 18: ఈపీఎఫ్ 95 ప్రకారం కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్ స్కీం ప్రారంభమై 30 ఏండ్లు దాటినా కనీస పెన్షన్ రూ.వెయ్యి నుంచి పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏండ్లు పరిశ్రమలో పని చేసి ఉద్యోగ విరమణ అయిన తర్వాత జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బతుకులు భారంగా తయారయ్యాయన్నారు. రూ.5వేల పెన్షన్ కోసం దశాబ్దకాలంగా పోరాటం చేస్తున్నట్లు గుర్తు చేశారు. కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచి డీఏతో కలిపి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను రూ.25 వేలకు సవరించాలన్నారు. ధర్నాలో నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, గణపతి, మహేందర్ రెడ్డి, యాదగిరి, బీహెచ్‌ఈఎల్, ఆర్చ్‌ఫార్మా, ఓడీఎఫ్, ముంగి, ఆల్ఫా, బ్ల్యూకార్ట్, హారిక డ్రగ్స్ తదితర పరిశ్రమల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



జిన్నారం, మార్చి 18: మండలంలోని వావిలాల, మాధారం, శివానగర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయ్ కుమార్, కవిత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్, మార్చి 18: నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. జిల్లా విద్యాధికారిగా మాహిన్, మండల విద్యాధికారిగా గోరీబీ, కలెక్టర్‌గా నిహారిక, ప్రధానోపాధ్యాయురాలుగా అక్షిత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలుగా పావని, ఉపాధ్యాయులుగా హర్షిణి, మల్లేశ్వరి, స్వాతి, లోకేష్ వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి బహుమతులు అందజేశారు. అనంతరం నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. స్వయంపాలన దినోత్సవాన్ని ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, కాశీనాథ్ జాదవ్, పండరి, మోహన్ పర్యవేక్షించారు.





చౌటకూర్, మార్చి 18: మండలంలోని శివంపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినీ, విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సౌమ్య, కలెక్టర్‌గా పవిత్ర, డీఈవోగా మధుకర్, ఎంఈవోగా కిరణ్ వ్యవహరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వృత్తి పట్ల తమకున్న గౌరవాన్ని చాటడంపై ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ విద్యార్థులను అభినందించారు.

## అగ్ని ప్రమాద బాధితుడికి సామగ్రి అందజేత



కార్పెంటర్‌కు సామగ్రిని అందజేస్తున్న మాజీ కౌన్సిలర్, పూర్వ విద్యార్థులు

జహీరాబాద్, మార్చి 18: జహీరాబాద్ రాచన్నపేట కాలనీలో షార్ట్‌సర్క్యూట్‌తో కార్పెంటర్ దుకాణం కాలిపోయి రోడ్డునపడిన బాధితుడు మారుతికి దాతలు కార్పెంటర్ సామగ్రిని అందజేశారు. ఆదివారం ప్రమాదవశాత్తు కార్పెంటర్ దుకాణం పూర్తిగా కాలిపోవడంతో నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్‌తోపాటు సరస్వతీ శిశుమందిర్ 1999 పూర్వ విద్యార్థులు అల్లాడి వేణుగోపాల్, గొల్ల ప్రభాకర్ బాధితుడిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. అగ్ని ప్రమాదంలో యంత్రాలు, పనిముట్లు, బైక్ పూర్తిగా కాలిపోవడంతో తిరిగి కార్పెంటర్ పనులు చేసుకునేందుకు కావాల్సిన రూ.25 వేల సామగ్రిని బాధితుడు మారుతికి అందజేశారు. పట్టణానికి వలస వచ్చి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కార్పెంటర్‌ను అన్ని విధాలుగా ఆదుకొని అండగా ఉంటామని దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, దాతలు పాల్గొన్నారు.

## యువ వికాస పథకంలో రాజకీయ జోక్యం ఉండొద్దు



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేసిన కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి, మార్చి 18: రాజీవ్ యువ వికాసం పథకంలో రాజకీయ జోక్యం లేకుండా కార్పొరేషన్ల అధికారులతో అమలు చేయ్యాలని, బ్యాంకు లింకేజీ లేకుండా సబ్సిడీ రుణాలు రూ.10 లక్షలకు పెంచి ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏవో పరమేశానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ ఇటీవల సీఎం సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపికను ఎమ్మెల్యేలు చేస్తారని చెప్పారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేసి దళితులకు ఆర్థికసాయం చేసిందని గుర్తుచేశారు. నిజమైన లబ్ధిదారులకు నష్టం జరగకుండా రాజకీయ జోక్యం లేకుండా పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. బ్యాంకు లింకేజీ పెట్టడంతో బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తుందన్నారు. బ్యాంకు లింకేజీ లేకుండారూ.10లక్షలు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.





గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

## శ్లోకలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జిన్నారం, మార్చి 18: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్, ఓరియంటేషన్ డే కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో ఆహూతులను విశేషంగా అలరించారు. విద్యార్థులకు కరస్పాండెంట్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల అభివృద్ధి నివేదికను తల్లిదండ్రుల సమక్షంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పల్టీకొట్టిన ఆటో.. తప్పిన ప్రమాదం

జిన్నారం, మార్చి 18: కార్మికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటన మండలంలోని కొడకంచి గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సాపూర్ నుంచి పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండకు కూలీలు ఆటోలో వెళ్తున్నారు. కొడకంచి సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే ఆటో ముందు టైరు ఊడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆటో పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న నీటి కుంటలో పడింది. ఘటనను గమనించిన స్థానికులు ఆటోలో ఉన్న వారికి తక్షణ సహాయం అందించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.




అందోల్: వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

అందోల్, మార్చి 18: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య అన్నారు. మంగళవారం జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నరేశ్‌కుమార్ అధ్యక్షతన టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువును అశ్రద్ధ చేయవద్దన్నారు. సమాజంలో చదువుకు ఎంతో విలువ ఉన్నదని కష్టపడితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఫోన్లు, టీవీలు పక్కన పెట్టి చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు నరోత్తం, మాజీ కౌన్సిలర్ శివశంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణఖేడ్, మార్చి 18: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.15 కోట్లతో ప్రారంభమైన నారాయణఖేడ్- సిర్గాపూర్ డబుల్ లేన్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, పనులను వెంటనే పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆర్డీవో అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్ పనులను కొనసాగించకుండా అసంపూర్తిగా నిలిపివేయడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకొని వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని వారు వివరించారు. పనులను ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చేసిన కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులను ప్రారంభించినప్పటికీ కొన్ని రోజులుగా పనులను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. ఈ విషయమై స్పందించి సత్వరమే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. ఆర్డీవో స్పందిస్తూ ఈ విషయమై కలెక్టర్‌కు నివేదించి పనులు ప్రారంభించేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, రవీందర్ నాయక్, మల్‌గొండ, అంజా గౌడ్, శంకర్‌నాయక్, మశ్చేందర్ ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడం సంతోషకరం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 18: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలపడం సంతోషంగా ఉందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు చర్చలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అసెంబ్లీలో ఎస్సీ వర్గీరణకు ఏకగ్రీవంగా మద్దతు తెలిపి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎంపీలు సైతం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును తీసుకురావాలని కోరారన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పును వెల్లడించడం మాదిగలకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సబ్‌కమిటీ వేసి అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలపడంపై సీఎం రేవంత్‌రెడ్డి, సబ్‌కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధత అయ్యే వరకు ఉద్యోగ నియామకాలను నిలిపి వేసి మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీలను పట్టుకున్న అధికారులు

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కల్హేర్, మార్చి 18: జాతీయ రహదారి 161పై మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రెండు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు. కల్హేర్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి శివారులోని దాబాల వద్ద వాహనాలు తనిఖీ చేశామని చెప్పారు. ఈ క్రమంలో ఏపీ 28 టీసీ 9549, ఏపీ 28 టీపీ 7550 నంబర్ల లారీలను తనిఖీ చేశామన్నారు. ఈ లారీలు కర్ణాటకలోని బీదర్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లోని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మికి సమాచారం అందించామన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ శివ శ్రీనివాస్ లారీలను నారాయణఖేడ్‌లోని సివిల్ సప్లై గోదాంకు తరలించారు. రెండు లారీల్లో 45 టన్నుల బియ్యం ఉందన్నారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్లు అయూబ్ అలీ, జుల్ఫీఖర్‌లతోపాటు లారీ యజమానులు అయూబ్ అలీ, మీర్జాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 18: నిమ్జ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిమ్జ్ ప్రత్యేకాధికారి రాజు, జహీరాబాద్ ఆర్డీవో, తహసీల్దార్‌తో సమీక్ష నిర్వహించారు. నిమ్జ్ ఏర్పాటుతో జహీరాబాద్ నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయన్నారు. ఉద్యోగ,ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయని తెలిపారు. నియమ నిబంధనల మేరకు నిమ్జ్ కోసం భూములు ఇచ్చిన వారికి నష్ట పరిహారం చెల్లిస్తామని తెలిపారు. పరిహారంపై భూ నిర్వాసితులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు రద్దు చేయాలి



బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

జహీరాబాద్, మార్చి18: పోరాటాలకు పురిటి గడ్డ, తెలంగాణ ఉద్యమానికి గుండెకాయవంటి ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలపై విధించిన ఆంక్షలను రద్దు చేయాలని జహీరాబాద్ పట్టణ, న్యాల్‌కల్ మండల బీఆర్‌ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు రాకేశ్, ఓంకర్, న్యాల్‌కల్ మండల బీఆర్‌ఎస్వీ మాజీ మండల అధ్యక్షుడు మారుతీయాదవ్‌లకు జహీరాబాద్, హద్నూర్ పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్శిటీలోఉద్యమాలను అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. నిరసనలు తెలిపే హక్కును హరిస్తూ ఆంక్షలు విధించడం అమానుషమని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అర్ధరాత్రి వచ్చి పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉస్మానియా యూనివర్శిటీలో విధించిన ఆంక్షలను రద్దు చేయాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### బీఆర్‌ఎస్వీ నాయకుల అరెస్టు

రాయికోడ్, మార్చి 18: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్వీ నాయకుల చలో అసెంబ్లీ ముట్టడి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన వద్దని ముందస్తుగా స్థానిక పోలీస్‌లు బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్టు చేశారు. మంగళవారం మండల పరిధిలోని కర్చల్, ఔరంగనగర్ గ్రామాల బీఆర్‌ఎస్వీ నాయకులు నరేస్, పవన్ కుమార్‌ను ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో ముందస్తుగా బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



బిలాల్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన పీఆర్టీయూ

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోహీర్, మార్చి 18: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు తిరుమలేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌నాథ్ విద్యార్థులను కోరారు. మంగళవారం మండలంలోని బిలాల్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల కోసం విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. ఉపాధ్యాయురాలు అనీక్‌ఫాతిమా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించేందుకు ముందుకు రావడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనందం, బషీర్‌అహ్మద్, వల్లబ్ జోషి, ప్రకాశ్‌రావు, విద్యార్థులున్నారు.